ఎస్సార్‌బీసీ... పర్యవేక్షణ వదిలేసి!

- దెబ్బతిన్న ప్రధాన కాలువ... ఛిద్రమైన బ్లాక్‌లు
- కనీస మరమ్మతులకు నోచుకోని కాల్వలు
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- ఇబ్బంది పడుతున్న రైతులు

పాణ్యం: ఎస్సార్‌బీసీ (శ్రీశైలం రైట్‌బ్రాంచ్ కెనాల్) ప్రధాన సాగునీరు వనరు. గడివేముల, నంద్యాల, పాణ్యం, గోస్పాడు, బనగానపల్లె, అవుకు, సంజామల, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల్లో ఎస్సార్‌బీసీ ఆయకట్టు విస్తరించి ఉంది. ఎస్సార్ బీసీ కింద మొత్తం 1,04,854 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధానంగా వరి సాగు చేస్తారు. అదేవిధంగా పత్తి, జొన్న, మిరప తదితర పంటలు ఈ కాలువ కింద సాగవుతుంది. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఎస్సార్‌బీసీ పర్యవేక్షణ కొరవడి సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు ఆయకట్టు. ప్రధాన కాలువ దెబ్బతినగా బ్లాక్‌లు ఛిద్రమయ్యాయి. దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన కాల్వ నుంచి చివరి ఆయకట్టుకు సాగునీరు చేరాలంటే ఆపసోపాలు పడాల్సి వస్తోంది. కాల్వలు ఎక్కడ చూసిన కోతకు గురికావడం, సైడ్‌వాల్ దెబ్బతినడంతో నీటి సరఫరా సాఫీగా సాగడం లేదు. ప్రధాన కాలువ సమీపాన ఉన్న రైతులు కొందరు నీటిపారుదలకు రాళ్లు అడ్డుగా వేస్తుండడంతో దిగువన ఉన్న రైతులకు సాగునీటి సమస్య ఎదురవుతుంది. ఇక పిల్లకాల్వల పరిస్థితి వర్ణానాతీతం.


బ్లాక్-4 వద్ద దెబ్బతిన్న ప్రధాన కాల్వ


బ్లాక్-4లో భూపనపాడు సమీపంలో దెబ్బతిన్న బ్లాక్

పాణ్యం సమీపాన ప్రధాన కాల్వ అధ్వానం

గోరుకల్లు జలాశయం నుంచి అవుకు వరకు ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ దెబ్బతినింది. ప్రధాన కాలువ సామర్థ్యం 2,300 క్యూసెక్కులు. అయితే పూడిక మూలంగా పూర్తిగా తగ్గిపోయింది. కాలువలో చాలాచోట్లా సైడ్‌వాల్(క్రాంక్రీట్‌వాల్) ఊడిపోయాయి. ప్రధానంగా పాణ్యం వద్ద 3వ బ్లాక్ వద్ద లెఫ్ట్ నందు కాంక్రీట్ వాల్ ఛిద్రమైంది. అదేవిధంగా పాణ్యం సమీపాన 4వ బ్లాంక్ వద్ద గేట్లు వెనక భాగంలో కూడా భారీ ఎత్తున సైడ్‌వాల్ దెబ్బతింది. దీంతో మట్టికోతకు గురవుతుంది. అలాగే కొణిదేడు గ్రామంలో వెనకభాగంలోనూ ఇదే సమస్య నెలకొంది. ప్రధాన కాలువ ఇలా ఉండగా బ్లాక్‌ల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఎస్సార్‌బీసీ రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎస్సార్‌బీసీ ఆయకట్టు విస్తీర్ణం వివరాలు

బ్లాక్ నంబర్	ఆయకట్టు విస్తీర్ణం (ఎకరాలు)
1	16,853
2	3,612
3	4,151
4	8,873
5	4,325
6	4,400
7	13,152
8	6,329
9	10,404
10	24,446
11	4,424
11ఎ	3,885
మొత్తం	1,04,854


కొనిదేడు- భూపనపాడు మధ్యలో దెబ్బతిన్న బ్లాక్

కాల్వలు అధ్వానం



ఎస్సార్‌బీసీ కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. ప్రధాన కాల్వల నుంచి చివరి ఆయకట్టుకు నీరు చేరాలంటే ఆలస్యమవుతుంది. ఎక్కడికక్కడ కాల్వలు దెబ్బతినిపోయాయి. పలుచోట్లా కోతకు గురయ్యాయి. ప్రధాన కాలువ సమీపాన ఉన్న రైతులు నీరు తక్కువగా ఉన్న సమయంలో రాళ్లు అడ్డుగా వేస్తున్నారు. దీంతో దిగువ ఆయకట్టుకు నీటి సరఫరా ఇబ్బందిగా మారింది. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

–సద్దల శ్రీనివాసరెడ్డి, రైతు, గగ్గటూరు

మరమ్మతులు చేయించాలి



అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలు గుర్తించాలి. కాల్వలు పూర్తిగా తినడం వలన సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొదటి కంటే దిగువన ఉన్న రైతులు నీటికోసం పడిగాపులు కావాల్సి వస్తోంది. భూపనపాడు సమీపంలో కాలువ లైనింగ్ దుబ్బతింది. వాటిని బాగు చేయాలని అధికారులకు విన్నవించినా స్పందన లేదు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతుల చేయించి రైతులకు ఇబ్బంది లేకుండా చేడాలి.

– మనోహర్, రైతు, భూపనపాడు

ప్రతిపాదనలు పంపాం

ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ, దిగునవ ఉన్న బ్లాక్‌లు దెబ్బతిన్న ప్రదేశాలను క్షేత్ర స్థాయిలో గుర్తించాం. మరమ్మతులు, పునఃరుద్ధరించేందుకు ప్రతిపాదలు పంపాం. అక్కడక్కడ మిగిలిన వాటిని కూడా క్షేత్రస్థాయి సిబ్బందితో పర్యటించి మరోమారు ప్రతిపాదనలు పంపిస్తాం. అనుమతులు రాగానే మొదటగా బ్లాక్‌లు బాగు చేస్తాం. అనంతరం ప్రధాన కాల్వలకు మరమ్మతులు చేయిస్తాం. చివరి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందేలా కృషి చేస్తాం.

– క్రిష్ణన్న దీఈఈ

క్లుప్తంగా

క్లోరినేషన్ నీటినే సరఫరా చేయాలి


గుండ్రేవులలో రైతుతో చర్చిస్తున్న ఏఈ గోసెనాయక్

సి.బెళగల్: ప్రజలకు క్లోరినేషన్ చేసిన మంచి నీటినే సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసెనాయక్ సచివాలయ ఉద్యోగులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లకు సూచించారు. మండల పరిధిలోని తుంగభద్ర నదితీర గ్రామాలైన గుండ్రేవుల, సంగాల గ్రామాలకు తుంగభద్ర నది నుంచి మంచి నీరు సరఫరా అయ్యే పోలకల్ గ్రామంలో పర్యటించారు. నీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు. నీరు కలుషితం కా కుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వర్షాకాల నేపథ్యంలో ప్రజలు నీటిని కాచి చల్లార్చుకుని తాగాలని ఈ సందర్భంగా ఏఈ సూచించారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో రైతులు పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఏపీఓ కుమార్‌సాయినాథ్ తెలిపారు. గురువారం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ జాబ్ కార్డు, ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. అర్హులైన రైతులకు మొక్కలతో పాటు, మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. తోటల రకాల మేరకు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి రైతులు భూ రికార్డులతో సంబంధిత ఎఫ్‌ఏలను సంప్రదించాలని సూచించారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యేలు

కల్లూరు: పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, గిత్త జయసూర్య గురువారం విజయవాడలో డీజీపీ ద్వారక తిరుమలరావును మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీని కలిసిన వారిలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఉన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రమాదేవి

పాణ్యం: పాణ్యం మండలం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ రమాదేవిని ఉన్నతాధికారులు నియమించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ ఫణికుమార్ తిరిగి వెళ్లారు. ఈ నేపథ్యంలో డీటీ రమాదేవి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

అర్హులందరికీ కౌలు కార్డులు అందజేస్తాం


కౌలు కార్డు అందజేస్తున్న డీఆర్‌సీ ఏఓ మాధురి

కల్లూరు: పొలాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్న అర్హులైన కౌలు రైతులందరికీ కౌలు కార్డులు ఇస్తామని డీఆర్‌సీ ఏఓ మాధురి తెలిపారు. మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో కౌలుకార్డు ప్రయోజనాలపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కౌలుకార్డు ఉంటే రాయితీ విత్తనాలను ప్రభుత్వం ఇస్తుందన్నా రు. అదేవిధంగా సాగు పెట్టుబడికి బ్యాంకు రుణాలు, పంట కొనుగోలు, ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు.అనంతరం కౌలు రైతులకు కౌలు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు రామాంజనేయులు, పద్మావతి, వీపీఏ సంధ్య, వీహెచ్‌ఏ తనుజ, గ్రామ నాయకులు ఈవీ రమణ, రైతులు సుబ్బారాయుడు, ప్రభా కర్‌రెడ్డి, చిన్న మద్దయ్య, భాస్కర్‌రెడ్డి, శేఖర్, తిమ్మయ్య, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎం పుష్పలత

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని బీసీ హాస్టల్‌లో గురువారం విద్యార్థులకు ఆరోగ్యంపై ఏఎన్‌ఎం పుష్పలత అవగాహన కల్పించారు. 72 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలను,25 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. అవసరం మేరకు విద్యార్థులకు ఉచితంగా మందులను అందజేశారు. వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా ఏఎన్‌ఎం విద్యార్థులకు సూచించారు.

జీఓ 117 రద్దు చేయాలి



ఎంఈఓ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కల్లూరు: యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జీఓ 117 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక నాయకులు ఎంఈఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా సహధ్యక్షులు హేమంత్ కుమార్, రఫీక్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఒకే విద్యా విధానాన్ని అమలు చేయాలని కోరారు. జీఓ 117 రద్దు చేసేవరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, అనిల్, వెంకటేష్, ప్రదీప్, లక్ష్మీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు రూరల్: సైబర్..ఆన్‌లైన్ నేరగాళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు ఎస్‌ఐ హనుమంతయ్య సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పేరుతో డబ్బులు వేస్తాం, అమరావతి నుంచి మాట్లాడుతున్నామంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఆశచూపి ఖాతాల వివరాలు తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఎవ్వరైనా వ్యక్తులు వాట్స్‌ప్‌ల ద్వారా లింకులు పంపినా, ఫోన్ చేసి వివరాలు తెలుపాలన్నా నమ్మొద్దని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్లకు వచ్చే ఓటీపీలను చెప్పరాదని, ఇటువంటి విషయాల్లో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో మోసం జరిగితే మోమాటం పడకుండా వెంటనే 1930కు ఫోన్‌చేసి సమాచారమివ్వాలని, దొంగల అకౌంట్‌ను హోల్డ్‌లో ఉంచే అవకాశం ఉందని ఎస్‌ఐ ప్రజలకు సూచించారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


అంగన్‌వాడీ చిన్నారుల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం తప్పకుండా అందించాలని ఎంపీడీఓ శకుంతల తెలిపారు. గురువారం ఆమె మండలంలోని ఇనగండ్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను పరిశీలించిన ఎంపీడీఓ వంటలు మరింత నాణ్యతగా చేట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరును స్వయంగా ఎంపీడీఓ నమోదు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామాలోని వీధులలో పర్యటించి పరసరాలు శుభ్రగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అనతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఎంపీడీఓ విద్యార్థులకు సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నియంత్రణ చర్యలను వివరించారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి


మాట్లాడుతున్న ఎండీ ఆనంద్‌బాబు

కోడుమూరు రూరల్: కాటి కాపరులు హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని కేజీబీఎస్ రాష్ట్ర నాయకులు ఎండీ ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం కోడుమూరులో కాటి కాపరులు, గుంతలు తీసే బేగరుల సంఘం సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు కాటి కాపరుల సమస్యలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, కాటికాపరులను కనీసం వృత్తిదారులుగా కూడా గుర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాటి కాపరులను 4వతరగతి ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు గఫూర్‌మియ్యా, మండల కార్యదర్శి వీరన్న, కేజీబీఎస్ మండల అధ్యక్షుడు ప్రకాశం, నాయకులు ఈశ్వరయ్య, శేషన్న, రాజు, నాగేశ్వరరావు, దేవన్న, వెంకటస్వామి, మాదన్న, బాలరాజు, మద్దిలేటి, నగేష్ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

కర్నూలు (టౌన్): నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి కార్పొరేటర్లు దాఖలు చేసిన నామినేషన్లను గురువారం అధికారులు పరిశీలించారు. స్థానిక నగర పాలక కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో పాటు నామినేషన్లు వేసిన కార్పొరేటర్లు పాల్గొన్నారు. కార్పొరేటర్ల ఎదుటే నామినేషన్లను పరిశీలించిన అధికారులు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించారు. అలాగే వచ్చే నెల 1వ తేదీ నిర్వహించనున్న పోలింగ్‌కు సంబంధించి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ.. ఈ నెల 28వ తేదీ వరకు కార్పొరేటర్లు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. మధ్యాహ్నం 3 గంటలు దాటిన తరువాత అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేయొద్దు
- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి


మురుగు కాలువ పక్కనున్న చెత్తను పరిశీలిస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: సీజనల్ వ్యాధులు పొంచివున్నాయని, పారిశుద్ధ్య పనులు చేయించడంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత అధికారులు మండల ప్రత్యేక అధికారి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని శకునాల గ్రామాన్ని గురువారం పీడీ సందర్శించారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఆయన మురుగు కాల్వలు, మంచినీటి పైపులైన్, చెత్త కుప్పలను పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పైపులైన్‌ను తొలగించి కొత్త పైపులైన్ నిర్మించాలని ఈ సందర్భంగా పీడీ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మురుగు కాల్వల్లో పేరుకపోయిన పూడిక తొలగింపు చర్యలు వెంటే చేపట్టాలన్నారు. ఇళ్ల ఎదుట వర్షనీరు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, ఆ దిశగా ప్రజలను సైతం చైతన్య పరచాలని సూచించారు. చెత్త కుప్పలను తొలగించి, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలని చెప్పారు. మంచినీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రజలు సాధ్యమైనంత వరకు కాచి చల్లార్చిన నీటిని తాగడం శ్రేయస్కరమని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జయపరిమళ, సచివాలయ ఏఎన్‌ఎం సుమిత్ర, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నదితీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: హోస్పేట్ డ్యామ్ గేట్లు ఎత్తి గురువారం సాయంత్రం వరదనీటిని విడుదల చేశారని, తుంగభద్ర నదితీర గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అనుపమ ఓ ప్రకటనలో సూచించారు. దాదాపు లక్షనర క్యూసెక్కులు విడుదల చేసినందున పెద్ద ఎత్తున వరదనీరు వచ్చే అవకాశం ఉందని, తిమ్మందొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, ముడుమాల, ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోట గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అదేవిధంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికార యంత్రాంగం వరదనీట ప్రభావంపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉంటూ నది వరదనీటితో తలెత్తే ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. రైతులు వ్యవసాయ మోటార్లు, పైపులైన్లను మార్చుకునే సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవానలి సూచించారు.

మోడలింగ్‌పై వర్క్ షాప్

కల్లూరు: దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో డీఎఫ్ టూల్స్ ఉపయోగించి ఇన్-సిలికో నానో మెటీరియల్ మోడలింగ్‌పై ఇంటర్నేషనల్ వర్క్ షాప్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 24న ప్రారంభమైన వర్క్‌షాప్ 29 వరకు సాగనుంది. అశోకా కళాశాలకు చెందిన హ్యూమానిటీస్ అండ్ సైన్స్ డిపార్ట్మంట, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్ (ఐఏపీటీఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నారు. ఐఏపీటీఏ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పీకే అహ్లువాలియా ముఖ్య ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ హరిష్ క్రిష్ణ, ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ


భోజనం రుచి చూస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. సమస్యలపై ఆరాతీశారు. ఆహార పదార్థలను పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని వంట నిర్వాహకులకు సూచించారు. భోజనానికి ముందు, భోజనం తర్వాత చేతులు శుభ్రంగా కడుగుకోవాలని విద్యార్థినులకు ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దటేకూరులో పశు వైద్య శిబిరం


గేదెలకు వైద్య చేస్తున్న పశు వైద్యులు

కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామంలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బహుళార్ధ పశువైద్యశాల ఉపసంచాలకులు డాక్టర్ హేమంత్ కుమార్, సహాయ సంచాలకు డాక్టర్ ధనుంజయ, కల్లూరు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పార్థసారధి పశువుల్లో గొడ్డు, మోతు పశువులు, ఎదకురాని పశువులను పరిశీలించారు. పాడి పశువుల ఆరోగ్యంపై పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చిన్నటేకూరు పశువైద్యులు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, వీహెచ్‌ఏ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్రీయ బాలస్వాస్థ్య అధికారిణి హేమలత

కోడుమూరు రూరల్: ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు అని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత అన్నారు. గురువారం గూడూరు హైస్కూల్‌ను ఆమె సందర్శించి చదువు ప్రాధాన్యత-బాల్య వివాహాల అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. చదువుకునే వయసులో వివాహాలు చేయడం ద్వారా తల్లిదండ్రులు బాలికల జీవితాలను ప్రమాదంలోకి నెట్టుతున్నారన్నారు. బాల్య వివాహాల మూలంగా బాలికల్లో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, ముఖ్యంగా మేనరికపు వివాహాలకు బాలికలు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మన్న గౌడ్, ఎంపీహెచ్ ఈఓ రామక్రిష్ణ, ఎంపీహెచ్‌ఎస్ రాఘవయ్య, ఏఎన్ఎం పద్మావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభ్రతతో ఆరోగ్యం


విద్యార్థులకు టీడీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని కోడుమూరు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న విద్యార్థులకు సూచించారు. గురువారం కోడుమూరు బాలుర హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది టీడీ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ధనుర్వాతము, డిఫ్తీరియా వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా విద్యార్థులకు టీడీ వ్యాక్సిన్ వేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్స్ కమాల్‌సాహెబ్, ఉమాబాయి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

హాస్టల్ ఇలా.. చదువు సాగేదెలా?


మరుగుదొడ్లకు తలుపులు విరిగిన దృశ్యం


నిరుపయోగంగా ఉన్న లెట్రిన్స్


దెబ్బతిన్న హాస్టల్ మెట్లు


గడివేముల బీసీ హాస్టల్

గడివేముల: మండల కేంద్రం గడివేముల బీసీ వసతి గృహం అస్తవ్యస్తంగా మారింది. ఈ హాస్టల్‌లో ఆరు నుంచి పదో తరగతి చెందిన 120 మంది విద్యార్థులు చదువుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా హాస్టల్ విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయి. అధ్వానంగా మరుగుదొడ్లు, పడిపోయేలా కిటికీలు తయారయ్యాయి. దోమలు తాండవం చేస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు బయటే సామూహిక స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రాంగణం బురుదమయం అయ్యింది. దీంతో దోమలు తమ ప్రతాపాన్ని విద్యార్థులపై చూపుతున్నాయి. విషజ్వరాలు ఎక్కడ సోకుతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి హాస్టల్‌లో కనీస వసతులు సమకూర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.